
నులక మంచం గిరాటేశాడు సుబ్బడు. దానికి నాలుగు కాళ్లు కాబట్టి సరిపోయింది కానీ, రెండు కాళ్ల దయితే కుంటి దయ్యేది. దాన్ని కుండ పెంకులు విసిరేసినట్లు విసిరాడు. సొంత దాన్ని, మళ్లీ అవసరమయినదాన్ని, ఎవరూ అలా పారెయ్యరు.

ఎట్లా పడేస్తే అట్లా పడి ఉన్న మంచాన్ని చాచి తన్నాడు. అది అంతెత్తు లేచి దభాలున పడి, కాళ్లెత్తేసింది, కరవలేని కుక్కలాగా. పడే ముందు కుయ్ః కుయ్ః మంది.

ఇంక మళ్లీ దాన్ని తన్నలేదు.

తల పట్టుకొని గడపలో కూర్చున్నాడు.

అది నులక అల్లిన మంచం. అల్లకంలో నులక కిందికీ మీదికీ, పక్కకీ, తలకట్టుకీ, కాళ్ల కట్టుకీ,ఈ మూలకి అటూ ఇటూ తిరిగింది. ఒక్కచోట లేదు. పైనో కిందో లేదు. సైకిల్ చక్రంలాగా కిందికీ మీదికీ తిరిగింది. ఒకసారి కిందికీ, ఒకసారి మీదికి, జీవితంలాగా తిరుగుతూ అల్లుకుపోయింది నులక చేతనయిన వాడి చేతిలో.



## వారం వారం కథాప్రభ

సుబ్బడు నులక అల్లకం చూస్తూ ఉన్నాడు. తల పట్టు కొనే ఉన్నాడు. తల ఎక్కడి కయినా పోతుందనుకొన్నాడో ఏమో పోనీయకుండా పట్టుకొన్నాడు.

అది పూరి పాక. ఇల్లుకాదు. కప్పు బొక్కలు పడింది. ఎండకు కప్పుగాని, వానకు కాదు. బొక్కల్లోంచి ఎండ పడి, నట్టింట్లో రూపాయి బిళ్లలార బోసింది. వాన పడితే, ముంతా, మూకుడు, చట్టి, పిడత, మళ్లీ ఎన్ని పెట్టినా బొక్కలకు చాలవు. పెట్టడు. తడుస్తూ మూల కూర్చుంటాడు సుబ్బడు.

సుబ్బడు మొద్దు. తుమ్మ మొద్దు. కారు నలుపు. చీకట్లో ఎదురు పడితే కష్టమే. రాత్రి సుబ్బడితో కష్టమే. అమాస నాడు పుట్టాడంటారు. కన్న వాళ్లు లేరు. ఉన్నారో లేరో తెలియదు. పరిగేరు కొంటూ పల్లెలోకి వచ్చాడు. అప్పుడు పదేళ్లు కూడా ఉండవు. నిక్కరొక్కటే చొక్కాలేదు. పైబట్ట కూడా లేదు. పాడుబడ్డ పాకలో పడుకొనే వాడు. అడుక్కుతినేవాడు. ఏ పని చెప్పినా చేసేవాడు. వాణ్ని ఎవరూ జీతానికి పెట్టుకోలేదు. ఆ పల్లె వాళ్లు ఊరికి జీతగాళ్లు, చెప్పులు కుట్టేవాళ్లు, కాటిలో శవాలు కాల్చేవాళ్లు, వెట్టిచాకిరీ చేసేవాళ్లు, వెట్టివాళ్లు, వాళ్లే జీతగాళ్లు. వాళ్లకింక జీతగాడి అవసరం ఉండదు. వాడు ఊళ్లో చేరలేదు. పల్లెలో చేరాడు. వాడి అదృష్టమో, దురదృష్టమో అక్కడికి చేరాడు. ఆడే ఉండిపోయాడు.

ఎవరన్నా తినటానికింత పెడితే తినేవాడు. నీళ్లు పోసినా తాగేవాడు. ఇచ్చినా తాగేవాడు. మంచోడనేవాళ్లు. కొందరికి పిచ్చోడు, దేశ దిమ్మరోడు, దబ్బాదోడు. దబ్బాదోడంటే అందరికీ తెలుస్తుంది. మొదట్లో వాడిపేరు సుబ్బడని ఎవరికీ తెలియదు. ఎవరా పేరు పెట్టారో, ఎవరు పిలిచారో, ఆ పేరే స్థిరపడిపోయింది.

సుబ్బడావూరు వదల్లేదు. పొరుగూరు పోలేదు. పదేళ్లనుంచి ఆ పల్లెలోనే ఉన్నాడు. నిజానికి దేశదిమ్మరోడు కాడు. కాదంటే మాత్రం వాళ్లూరుకొంటారా? ఊరుకోరు. పిలుస్తారు. కానీ ఈమధ్య మానేశారు. సుబ్బా' అనే పిలుస్తున్నారు.

ఊరు గాని ఊరు. పేరు గాని పేరు. ఇల్లు గాని ఇల్లు. ఆ పాక లోంచి ఎవరూ వెళ్లి

పొమ్మనలేదు. ఆ పాకలో ఉండటానికి సొంతదార్లు ఎవరూ రాలేదు.

పాక కాక ముందు అది మంచి ఇల్లే. అది ఎవరికీ అచ్చి రాలేదు. ఆ ఇంట్లో ఉన్న వాళ్లు చావరాని చావులు చచ్చారు. వాళ్ల వంశం పుటమారిపోయింది.

అన్నదమ్ములవాళ్లు రాలేదు. దూరపు వాళ్లు కూడా రాలేదు. ఈ ఇల్లు మాది అనలేదు. ఈ స్థలం మాదన్నవాళ్లు కూడా లేరు. చుట్టుపక్కల వాళ్లు కూడా ఆ స్థలం గదుంకోలేదు. ఎవరూ దాన్ని ఆక్రమించలేదు. అది కలిసిరాని కొంప.

గోడలు మొండివయ్యాయి. కప్పు కూలింది. వెళ్లాడు. సుబ్బడు అభిమన్యుడి కంటే గొప్పవాడు. అందులో నుంచి బయటకి రాగలిగాడు.

ఆ ఇంటి మీద కప్పు క్రమంగా జారింది. బొంగులు గోడల మీద నిలబడ్డాయి. తాటాకులు వాటి మీదే నిలచిపోయాయి. అది అట్లా పందిరి లాగా మారింది. అక్కణ్ణుంచి మరీ నేల మీదికి జారకుండా రెండు కర్రలు తెచ్చి పోటు పెట్టాడు సుబ్బడు. తాటాకు అడ్డం పడకుండా చూశాడు. కర్రలు బిర్రుగా నిగడదోలాడు. అప్పుడు దానికి ఇంటి ఆకారం రాలేదుకానీ, పందిరి కాకుండా పోయింది. ఆ పాకే సుబ్బడి స్థిర నివాసమయింది. ఈ పదేళ్లలో దాన్ని పడిపోకుండా చూడటమే



# నల్లలు

ఆచార్య కొలకలూరి ఇనాక్

చెదలు పట్టింది. పందులూ, కుక్కలూ స్నేహంగా ఉండేవి. ఇంటిముందు గోడల మీద గడ్డి మొలిచింది. పక్క ఇళ్ల మురికి అంతా అక్కడ పేరుకు పోయింది. ఈ ఇంట్లో సుబ్బడు పద్మవ్యూహంలోకి ప్రవేశించిన అభిమన్యుడులాగా సుబ్బడు ఆ ఇంటి మీద చూపించిన శ్రద్ధ. ఆకులలములు దెచ్చి కప్పాడు. నులక దొరికితే కట్టాడు. చెదలు పడితే దులిపాడు. పందులొస్తే వాటికి సావాసగాడయ్యాడు.

దానికొక తలుపు, తాళం పుట్టుకొచ్చేసరికి

అదే దేవేంద్ర భవనం. తానే శ్రీ మహావిష్ణువు, నులక మంచమే హంసతూలికా తల్పం. పాకలోకి కుండా, చట్టీ, దబరా, గళాసు సంపాదించుకున్నాడు.


ఈ పదేళ్లలో సుబ్బడు నిక్కరోడు పంచోడయ్యాడు. పాత్రం లాంటివాడు రుబ్బురాయిలా మారాడు. గెల్లగాబులా ఎత్తరి, గూటంలా పోటుగాడు, ఆరెలా చురుకైన వాడు, వారులా చలాకీ అయినవాడు, ఉంగటంలా గుండ్రంగా ఉన్నాడు, పలిరాయిలా కూర్చుంటాడు. తొలుతిత్తిలా పడుకొంటాడు. పైబట్ట ఈ తోలురాముడి మీద సలపలాగా ఉంటుంది. ముక్కు మిగ్గు కొమ్ములాగా ఉంటుంది. మీసాలు కిర్రు చెప్పుల ఊలు గారాల్లాగా ఉన్నాయి. బరువు పనులు సులువుగా చేసేవాడు. గొడ్డుచాకిరీ చేసేవాడు.

బండపనికి దచ్చాదోణ్ణి పిలవండనేవాళ్లు. ఎవరికీ సాధ్యంగాని పని అయితే సుబ్బణ్ణి రానీయండనేవాళ్లు. మొద్దు పనులు మొరటు పనులు, బండచాకిరీ వాడికే చెల్లు.

పల్లెవాళ్లు పాపిష్టి వాళ్లు కారు. వాడికేం కష్టం లేదు. తిండికి లోపంలేదు. పాకా, బట్టా జరిగిపోతున్నాయి. తెల్లటి మల్లెపూవు లాంటి పంచ ఇచ్చినా, రెండు రోజుల్లో దాన్ని ఎర్రగరువు దుమ్ములో కుమ్మి ఖరీదయిన ఎర్ర ఖద్దరుగా మార్చే దేశభక్తుడు సుబ్బడు.

ఎందుకురా సుబ్బా, మంచాన్ని ఎగరేసి ఎగరేసి తంతున్నా' అంటూ తాత వచ్చాడు. తాతను ఊళ్లో అందరూ తాతే అంటారు. సుబ్బడికీ తాతే!

తాతది ఏవూరో తెలియదు. ఏ పేరో తెలియదు. గుళ్లో పడు కుంటాడు. ఊళ్లో తిరుగు తూంటాడు. తాతకు సొంత వాళ్లు లేదు. ఆ వూరుకాదు. ఎక్కడ నుంచో వచ్చాడు. అక్కడ స్థిరపడ్డాడు.




తాత ముసలివాడుగా ఆ వూరు వచ్చాడు. తాత అయ్యాడు. సుబ్బడు పిల్లవాడిగా వచ్చాడు. దచ్చాదోడయ్యాడు. ఎవడికో ఏ పేరో వస్తుంది. ఆ వచ్చిన పేరు ఒక పట్టాన మారదు. అవసరమూ కాదు, అర్హతా కాదు. ఆపేరు అలాగే నిలబడి పోతుంది.

తాత అందరికీ తల్లో నాలుక. తొలకరి వానలు, ఎండలు, ఏరువాక, తిథి, వారం, నక్షత్రం, పంటలు, పంచాంగం మంచీ చెడూ ఏరోజు ఏ దిక్కు ప్రయాణం, పుట్టమచ్చలు , హస్తసాముద్రికం అన్నీ తాతకు తెలుసునని వాళ్ల నమ్మకం. తాత చెప్పినట్లు జరిగేవి. వినేవాళ్లు పల్లెవాళ్లు.

తాత అంటే సుబ్బడికి వల్లమాలిన ఇష్టం, భక్తి. తాతే తల్లీ, తండ్రీ, గురువూ, దైవమే. తాతమాట వేదవాక్కు.

నల్లులు!" సుబ్బడు కసిగా ఉన్నాడు.

అని మంచం ఇరగ్గొడతా?' తాత అడిగాడు.

రేత్రంతా నిద్దర్లేదే అయ్యా!'

అని మంచం ఇరగ్గొడతా?'

వొల్లంతా నెప్పులు!'

తాత సుబ్బడి తల నిమిరి, వీపు నిమిరి, చేతులు పట్టుకొని, పసిపిల్లవాడికి చెప్పినట్లు చెప్పాడు.

'నల్లుల్ని నలిపేయాలిగానీ, మంచం విరగొట్టుకొంటే మానమా, మరేదా?'

తాత చెబుతుంటే గుడ్లప్పగించి విన్న సుబ్బడు తాత వెళ్లిపోగానే వెల్లకిల బడ్డ మంచాన్ని బోర్లా పడేశాడు. ఈ సారి తన్న లేదు. దయ లేదు. కోపం లేదు.

మంచం అలగలేదు. బెట్టు చేయలేదు. కూర్చుంటే గొణిగిందే ఇంతగా మోసే నన్ను అంతగా తంతావా?'

ఈ మధ్య చిన్న పిల్లలు సుబ్బణ్ణి దొంగోడనీ, కన్నాలేసేవోడనీ, దోపిడీ దొంగ అనీ, గజకన్నగాడు అనీ, రకరకాలుగా పిలిచి ఎగతాళి చేస్తున్నారు.

పల్లెవాళ్లు పిల్లల్ని గదమాయిస్తారు' పాపం వాడొట్టి అమాయకుడు' అనుకొంటారు గానీ పైకి అనరు.

అప్పుడప్పుడు సుబ్బణ్ణి పోలీసులు పట్టుకు పోయి నాలుగు తన్ని, నాలుగు రోజులుంచుకొని, వీలయితే నెలో, రెండు నెలలో జైల్లో పెట్టి, కూడు పెట్టి, లేదంటే వదిలేసి తమ డ్యూటీ తాము చేసుకు పోతూన్నారు.

తాత మాత్రం' ఆడు దొంగోడు గాడు' అని వందమందితో చెప్పి ఉంటాడు. తాడూ బొంగరం లేని వాడిమాట ఎవరు వింటారు? వినలేదు.

పల్లెలో అందరూ తాత మాట అవునూ అనుకొంటారు. నిజమే అనీ అనుకొంటారు. కానీ ఏమీ అనరు. మునసబు మాత్రం ఆడు దొంగనా కొడుకే! అంటాడు. మునసబు అంతటి వాడు తనను 'నాకొడుకు' అన్నాడని సుబ్బడు మురిసిపోతాడు.

సుబ్బణ్ణి పోలీసులు పట్టుకుపోవడం, వది లేయడం వీడు రావటం మామూలయి పోయింది. సినిమా చూసి వచ్చినట్లే. ఒక్కసారి గాదు ఆరుసార్లు!

నేను దొంగోణ్ని గాదన్నాడు. ఎవరూ వినలేదు.

రెండు సార్లు పోలీసులే వదిలేశారు. రెండు సార్లు కోర్టే వదిలేసింది. రెండుసార్లు జైలుకు పోయాడు.

ఒక సారొక నెల, ఇంకో సారి రెండు నెలలు. జైలులోనూ బాగానే ఉంది. పల్లె లోనూ బాగానే ఉంది. కష్టమంతా పిల్లలతోనే. దొంగనాయాలంటే వినలేడు సుబ్బడు. కోపం వస్తుంది. పేదవాడి కోపం పెదవికి చేటు కాలేదు.

పోలీసుల దెబ్బలూ ఫరవాలేదు. జైలూ ఫరవాలేదు. పిల్లల అల్లరీ భరించవచ్చు. అన్నీ తెలిసిన మునసబే దొంగ అన్నందుకు దిగులు, కోపం, వళ్లు మంట. పేదవాడు ఏం చేస్తాడు. పెదవి కొరుక్కోలేదు. పళ్లు నూరి అరగ్గొట్టుకో లేదు. కానీ తనకి తెలియకుండానే పెదవి పుండయింది. ఎవరీ పుండు చేసింది? తెలియదు. పసరు పిండి మందేసిన తాతకు సుబ్బడి పెదవి పుండెవరు చేశారో తాతకు తెలుసు.

దిక్కూ దివాణం లేని వాడికి ఏం తెలిస్తే మాత్రం ఏం లాభం? సుబ్బడు దొంగ కాడని తాతకు తెలుసు కానీ ఏం లాభం? మంచోడనీ తెలుసు, ఏంలాభం? ఊరు వాడా లేనివాడు ఏం చెబితే ఏం లాభం? ఎవరూ వినలేదు, వాళ్లగోడు.

మునసబు పట్టుకుపోయినా ఎవరూ ఏమీ మాట్లాడరు. పోలీసులు తీసుకుపోయినా అంతే! సుబ్బడు తిరిగి వచ్చినా అంతే. వాడి రాకపోకలతో పల్లెకు నిమిత్తం లేదు. వాడున్నా లేకున్నా వాళ్లకేమీ పట్టదు. పోతుంటే ఉండమనరు, వస్తుంటే రమ్మనరు. ఉంటే పొమ్మనరు, ఉండమనరు. పని పడితే పిలుస్తారు, పని అయిపోతే పంపుతారు. కరివేపాకు తంతు. కూర వండిన నాడు వాసన రుచి చూచినట్లు సుబ్బడు పల్లెలో బతుకు తున్నాడు.


సుబ్బడు ఉన్నా లేకున్నా పాక జోలికి ఎవరూ రారు. వాడు లేకపోతే పాక ఖాళీ! ఉంటే భర్తీ!

తాత పల్లెలో ఉంటే సుబ్బణ్ని పలకరిస్తాడు. పక్కూరు పోతే వీడు నిద్ర పోతాడు.

'పల్లోళ్లంటే వూళ్లోవాళ్లకింతలుసా?' అని సుబ్బడు తనలో తాను నూటొక్కటోసారి గొణుకున్నాడు.'యెందుకు సావీఁ నన్ను దొంగన్నా?' అని మునసబును సుబ్బడు అడక్క పోలేదు.

'పని చెబితే, దొడ్డికి బొయెత్తానావటానికి జెప్పి అయిపు లేకుండా బోతా?'

వాడా రోజు గుర్తుకు తెచ్చుకున్నాడు. మునసబు పని చెప్పిన రోజు ముందు రాత్రి ఏం తిన్నాడో? ఏమో, ఎవరు బెట్టిన ఏ సద్ది బొద్దీ తిన్నాడో, ఎవరు పోసిన పుల్లీళ్లు, కడుగు గంజీ తాగాడో, నిజంగానే విరేచనాలు పట్టు కున్నాయి. సాయంకాలం నుంచి రాత్రంతా వాడు చెరువు దగ్గరే పడుకున్నాడు.



తాత ఉండబట్టి బతికి పోయాడు. లేకపోతే నూకలు చెల్లేవే!

ఎంత చెప్పినా మునసబు వినలేదు. 'దొంగ' అన్నాడు. పోలీసులకు పట్టి ఇచ్చాడు. మునసబు మీద వాడికి కోపం లేకపోలేదు. ఏం లాభం? పెదవిమీద పుండవుతుంది. మండుతుంది. మూడురోజుల కిందట సుబ్బణ్ని పోలీసులు పట్టుకు పోయారు.'వాడే దొంగ' అన్నారు మునసబు. తనను దొంగ అన్నప్పటికీ తాను దొంగ కాడని మునసబుకు తెలిస్తే చాలని సుబ్బడి తాపత్రయం. ఎవడికి పట్టింది వాడి గోల? అప్పటికి ఆరుసార్లు అన్నాడు మునసబు దొంగని. ఆరుసార్లూ అబద్ధమే.

దొంగతనం జరిగిన రోజు రాత్రి ఎక్కడు న్నావని పోలీసులు రివాజుగా అడిగేవాళ్లు. రివాజుగా తన్నేవాళ్లు. నా పాకలో ఉన్నానంటే సాక్ష్యం లేదు పొమ్మనేవాళ్లు. నాలుగు సార్లే నా పాకలో' అనే అన్నాడు. ఐదోసారి మాత్రం 'నాగి పక్కలో' అన్నాడు.

నాగి సాక్ష్యం చెబుతుందని సుబ్బడి ఆశ. నాగికి సుబ్బడి ఎదురొమ్మంటే ఎక్కడలేని ఇష్టం.

కోర్టుకు నాగి వచ్చింది. రాలేదు, తీసుకొని వచ్చారు. పెళ్లి కాని పిల్ల. సంబంధాలు చూస్తున్నారు. సుబ్బడికి వెయ్యేనుగుల బలం వచ్చింది.

సుబ్బడెవురంది.. నాకేం తెలుసునంది. నాకేం సంబంధం అంది. దచ్చాదోడితో మాకేం పని అంది. నన్నెందు కేడిపిత్తన్నారంది. ఏడ్చింది. మొత్తుకుంది వెళ్లిపోయింది.

సుబ్బడికి రెణ్నెళ్లు జైలు. జైలుకేం ఫరవాలేదు. జైలు బాగానే ఉంది. నాగి ఎరగనందే అనే మంట. ఆ మాట వళ్లంతా కాలుస్తూ ఉంది. రెణ్నెల్లూ అంతే!

వాడు జైలునుంచి వచ్చేసరికి నాగికి పెళ్లయిపోయింది. పుట్టింటికి వచ్చినప్పుడు 'పలకరిస్తే మా నాయన సంపుతానన్నాడు' అంది వాడేమీ అనేదు. ఏడుస్తూ కూర్చున్నాడు.

తానేమీ లేనివాడు. తనకెవరూ లేరు. దిక్కు లేనివాడికి ఎవరూ దిక్కుగారు. దేవుడే దిక్కు. దేవుడే దిక్కులో ఉన్నా దిక్కుమాలిన ఊరికి తెలియదు. పల్లెకూ తెలియదు. గుడికీ తెలియదు దేవుడికీ తెలియదు.

ఉన్నవాళ్లకు అందరూ ఉంటారు, అన్నీ ఉంటాయి.. లేని వాళ్లకు ఎవరూ ఉండరు, ఏమీ ఉండవు. ఉన్నా ఉపయోగం లేకుండా అయిపోతుంది. సుబ్బడు ఏడుస్తూ నెత్తుకొస్తున్నాడు.

వాణ్ని తిడితే, ఎందుకు తిట్టావని ఎవరూ అడగరు. కొడితే ఎందుకు కొట్టేవని అడిగే దిక్కుండదు. దొంగ అంటే కాదనేవాళ్లు లేరు. కాదని తానంటే వినేవాళ్లు లేరు. విన్నా నమ్మరు. నమ్మేవాళ్లు దొంగకాదని చెప్పలేరు. ఒప్పుకోలేరు.

మునసబు అబద్ధం చెబుతాడు. చెల్లుతుంది. తాను నిజం చెబుతాడు. నమ్మరు, చెల్లదు.

ఉన్న వాళ్ల మాటకు విలువ ఉంది. లేని వాళ్ల మాటకు లేదు. సుబ్బడికి దిక్కు తోచటం లేదు.

ఎండ నెత్తిమీదికి వచ్చింది. ధర్మం నాలుగు పాదాల మీద నిలబడ్డట్లుగా మంచం నాలుగు కాళ్ల మీద కూర్చుని ఎండలో మాడుతూ ఉండి. కూర్చుంటే మూలుగుతూ ఉంది.

సుబ్బడు నెమ్మదిగా మంచం ఒక పక్క పైకెత్తాడు. దభీమని నేలకేసి కొట్టాడు. నల్లులు మంచం కోళ్ల సందుల్లోంచి జారి నేల మీద పడ్డాయి. ఎండ వేడికి గింగిరాలు తిరుగుతున్నాయి. మంచం నీడకు పరుగులు తీస్తున్నాయి.

వాడు నల్లుల్ని నలపడం మొదలు పెట్టాడు. కాలి కింది కొస్తే కాలి దెబ్బ, చేతి కింది కొస్తే చేతి దెబ్బ. నలిపేస్తున్నాడు. నీడ లోకి పోనివ్వటం లేదు. మళ్లీ మంచం కోడెక్కి గూడు చేరాలనుకొన్న వాటని మధ్య అటకాయించి హతమారుస్తున్నాడు.

కాలి కింద పడి నలిగిపోవలసిన నల్లి ఒకటి కాలెక్కింది. ఎక్కి ఊరుకోలేదు. పారాడుతూ ఉంది. పారాడుతూ బతికిపోలేదు. కరిసింది, కొరికింది. సుబ్బడు ఏమీ అనలేదు. ఏమీ చేయలేదు. అది ఇంకా ఏం చేయగలదో చూస్తున్నాడు. ఊరికే ఉన్నాడు. నెత్తురు తాగుతూ ఉంది. తాగనిచ్చాడు. ఎంతసేపు తాగుతుందోనని చూశాడు. ఎంతో సేపు తాగలేదు. కడుపు నిండింది. కాలి మీద పట్టు తప్పింది. దాక్కొనే చోటు లేదు. కింద బడింది. కదల్లేదు. కడుపు నిండా నెత్తురు. ఆయాసం. కాలి బొటనేలు దాని మీద పెట్టాడు. ఏమయిందో ఏమో పొట్ట పగిలింది. ఏమీ బయటికి రాలేదు. నెత్తురే


వచ్చింది. తన నెత్తురే, తన కాలి కింద తన శరీరంలో నెత్తురు. నేల మీద, దిగులుగా చూశాడు సుబ్బడు.

మంచం కాళ్ల కట్ట దగ్గర పట్టుకొని ఎత్తి నేలకేసి కొట్టాడు. గుట్టలు గుట్టలుగా నల్లులు పడ్డాయి. కాలి కింద, చేతి కింద కిక్కురుమనకుండా చచ్చిపోతున్నాయి. తన కాలి కింత బలం ఉందాని సుబ్బడు ఆశ్చర్యపోయాడు. తన కాళ్ల చేతులు చంపగలవా అని నమ్మలేకపోయాడు.

పందెపు బండి లాగినప్పుడు అంత ఆనందం కలగలేదు, బురద లోంచి ఎడ్ల బండిని బయట కీడ్చినప్పుడు ఇంత సంతోషం కలగలేదు. ఎన్నో మంచి పనులు చేసి, తాను ఆనందించలేదు. నల్లుల్ని చంపి పరమానంద పడిపోయాడు.

ముందుగా పెద్ద పెద్ద నల్లులు రాలిపోయాయి. చిన్న చిన్న నల్లులు మంచాన్ని పట్టుకుని వదలటం లేదు. వాటిని మంచంలోనే చంపాడు. ఈర్లున్నాయి. పుల్లలతో పొడిచి చంపాడు. కోళ్ల సందుల్లో, పట్టెల ఇరుకుల్లో, నులక మడతల్లో దొరికిన నల్లిని దొరికినట్లు చంపాడు. అనుమానం తీరక వేడినీళ్లు తెచ్చి పోశాడు. తుట్టెలు తుట్టెలు కింద పడ్డాయి. చచ్చిన నల్లులు చావగా బతికి ఉన్న వాటని వీడు నలిపేస్తున్నాడు. ఇక మంచంలో నల్లి నామ రూపాలు లేవని నమ్మిన తరువాత మంచం తీసి వెలికిలగా వేసి చూస్తూ కూర్చున్నాడు.

నల్లిని చంపటం దుష్ట శిక్షణ, తనను తాను కాపాడుకోవటం శిష్ట రక్షణ. అసలెందుకీ విష్ణువు ఇన్ని అవతారా లెత్తింది. విష్ణువు తనను ఆక్రమించు కొన్నాడను కొన్నాడు సుబ్బడు. పోలేరమ్మ జాతరలో పూనకం వచ్చిన గణాచారి లాగా ఊగి పోయాడు వాడు. కనబడ్డ నల్లిని కనబడ్డట్లు చంపి పారేశాడు. పోతురాజుకు గొర్రెల్ని, మేకల్ని కోళ్లని బలిచ్చినట్లు, మంచానికి నల్లుల్ని బలిచ్చాడు.




ఊళ్లో దొంగతనం జరిగితే సుబ్బణ్ని పట్టు పట్టుకుపోవడం సాధారణమయింది. అది బాగా లేదనుకున్నారో, వాడు దొంగ కాదనుకొన్నారో ఏమోగానీ రెండు రోజులుంచుకొని ఎక్కువగా కొట్టకుండా వాణ్ణి వదిలేశారు.

సుబ్బడిది గానుగెద్దు జీవితం. ఆ పాకే కట్టుగొయ్య. ఆ ఊరు వదిలి పోదామంటే ఇల్లొక బందిఖానా! ఇల్లు పోతే పోయింది లెమ్మనుకుంటే తాత చెప్పాడు! యే వూళ్లోనన్నా ఉండేది మణుసులే!- యీ ఊళ్లో వుండలేనోడివే వూళ్లోనూ ఉండలేవు. బతుకుతావా ఈడే బతుకు. సత్తావా యీడే సావు.

అప్పట్నుంచి ఊరొదిలి పోయే ప్రయత్నం సుబ్బడు చేయలేదు.

తనను దొంగను చేస్తున్న దొంగతనాలు ఎవరు చేస్తున్నారో ఏమిటోనని పది మందినీ అడిగాడు సుబ్బడు. అలా ఆరా తీయగా తీయగా మునసబే చేయిస్తా ఉన్నాడని తెలుసుకొన్నాడు వాడు.

ఎర్రగుడ్లోడు, మిడి గుడ్లోడు దొంగతనం చేసి తెచ్చిన సొమ్ము, డబ్బూ దస్కం, వెండీ బంగారం, నగా నట్రా, పాడూ పరదేసు అన్నీ వాళ్లు మునసబుకిస్తారని, అవన్నీ డబ్బుగా మునసబు మారుస్తాడని, ఆ డబ్బుతోనే వాళ్లు తాగి తందనాలాడతారని తెలుసుకొని సుబ్బడు బావురుమని ఏడ్చాడు.

ఎర్ర గుడ్లోణ్ని గానీ, మిడి గుడ్లోణ్ని గానీ, పోలీ సులు పట్టుకుపోలేదు. మునసబు పట్టివ్వలేదు. తిట్టలేదు, కొట్టలేదు, జైలులో పెట్టలేదు. అన్నింటి కంటే ముఖ్యంగా 'దొంగ' అనలేదు. తనను దొంగ అన్నారు. వాళ్లను అనలేదు. వాళ్లకు రావలసినవన్నీ తనకు వచ్చాయి. తిట్లు, దెబ్బలు, శిక్షలు. సుబ్బడి కిప్పుడు నొప్పులు, మంట కడుపులో, కళ్లలో.

గవళ్ల పెద తాత తాటి చెట్టుకింద కల్లు కుండలు నురుగులు కక్కుతున్నప్పుడు ఎర్రగుడ్లోడు, మిడిగుడ్లోడు వచ్చారు. తాటాకు బొక్కెన్లు పట్టుకున్నారు. మునిగాళ్లమీద కూర్చున్నారు.

పెద తాత పోస్తున్నాడు, వాళ్లు తాగుతున్నారు. చీకుడుగళ్ల ఎరనాగమ్మ చీకులు కాల్చి ఇస్తే నములుతున్నారు. నంజుకొంటున్నారు, కల్లు తాగుతున్నారు.

పట్టుకుపోయిన పోలీసులు వదిలిపెడితే ఎర్ర గరువున పొలాల కడ్డంపడి, ఆ తాటి తోపు లోంచి పెద తాత తోపు లోకి వచ్చిన సుబ్బడు చూచిన దృశ్యం కోపం తెప్పించింది.

వాళ్లు మధ్యాహ్నం దాకా తాగుతూనే ఉన్నారు. అప్పటికే వాళ్లు చెరి రెండు తొట్టెలు తాగేశారు. కడుపా? చెరువా? తాగుతూనే ఉన్నారు.

వాళ్లు వెళ్లిపోయే టప్పుడు గవళ్ల పెదతాత కల్లుకు డబ్బు అడగలేదు. చీకుడు గళ్ల ఎర్నాగమ్మ కూడా చీకులకు డబ్బు తీసుకోలేదు. వాళ్లందరి కీ మునసబు ఇస్తాడని తెలుసు.

'రేపు రాత్రికి నాలుక్కడవల కల్లు, పుల్లగున్నా సరే, మూడు నీసాల సారాయి మునసోబు ఇంటి కొడికి పంపాలంట సెప్ప-మన్నాడు మునసోబు' అన్నప్పుడే వాళ్లకు అంతా అర్థమయి పోయింది. ఇంక డబ్బులడిగే దమ్ము లెవరకీ లేవు.

ఎరగుడ్లోడు, మిడిగుడ్లోడు లేచి ఊడే పంచెలు ఎగదోపుకొంటూ తూలుతూ, పేలుతూ జారుతూ ఊరిముఖం పట్టారు.

అప్పుడు వచ్చాడు సుబ్బడు పెద తాత దగ్గరకో యేం రోయ్, యెన్నడు లేంది, యిట్టా వచ్చేవో' అన్నాడు పెదతాత.

'పోలీసోళ్లు వదిలిపెట్టారయ్యా, ఇట్టా వత్తన్నా' సుబ్బడు చెప్పాడు.

'అట్టా జెప్పు! ఈడేందా, కల్లుకాడికి రాటవేందా అనుకొన్నా' అన్నాడు. వొదిలి పెట్టేరు గందా, పొన్లే పోయిరారా సుబ్బా'.

సుబ్బడు పోబోయేడు.

ఆళ్లల్లో ఎందుగ్గలుత్తా? మంచోడివి సెడతావు, పోబాక'

యింకా సెడేదేం దయ్యా' అంటూ సుబ్బడు చాలా దూరం వచ్చాడు. ఇక పెద తాత మాట వినబడదు.

వాళ్లిద్దరూ లల్లాయి పదాలు అందుకొన్నారు.

నిన్ను రమ్మన్నాది

నన్ను రమ్మన్నాది

ఇద్దర్నీ - ఇద్దర్నీ - ఇద్దర్నీ
ఇద్దర్నీ రమ్మాని
నిద్దర బోయింది
లబో లబో లబుజనక
అబ్బ దాని సోకో
జబ్బల మీద జాకెట్టూ!

వాళ్లిద్దరూ పాడుతూనే ఉన్నారు, పడుతూ లేస్తూ ఉన్నారు. మాట ముద్ద ముద్దగా ఉంది. కాళ్లకింద పడుతున్న పంచెల్ని తొక్కుకుంటూ పోతున్నారు. ఒకరి నొకరు పడకుండా వాటేసుకొంటూ ఇద్దరూ పడుతున్నారు. లేస్తున్నారు. నడుస్తున్నారు. పాడుతున్నారు. స్పృహ లేదు.

అన్నలిద్దరిని అప్పుడు పలకరించాడు సుబ్బడు.

ఉరుములురిమినట్లు నవ్వారు. పిడుగులు పడ్డట్లు నవ్వారు.

'దొంగోడురా, దొంగోడు' నవ్వుతూనే ఉన్నారు.

'నేను దొంగోణ్ణా'?

'మరి మేమా?' నవ్వుతూనే ఉన్నారు. మేవే యేం జేత్తా?' అడిగారు.

సుబ్బడు దిగాలు పడిపోయాడు.

'రాత్రికి తాగు తారా?'

'ఆ!'

'శేపు రాత్రీ తాగుతారా?'


'ఓ! బయివా?'

'శేం(త్రం తా తాగుతానేనా'

'ఓ! తాగుతాం, బయివా? అద్ద్రేతిరి దాకా తాగుతాం. వత్తావా? దా! నువ్వూ దాగుతావా? వత్తే రా ! తాగుదాం. పీకల్దాకా తాగుదాం. దా, దామ్మదా!'

'యెందుకంతగా దాగటం?'

'వొకణ్ని జంపాల' యెవుణ్ని?'



అమ్మ నా కొడక. నీకు జెప్పం. తాగేరు సెబుతారు అనుకుంటన్నా? ఈల్లేదు, ఈల్లేదంటే ఈల్లేదురా దొంగనాకొడక. ఆణ్ణి జంపి నిన్ను బొక్కలో తోపిచ్చాలి. సంపేది అణ్ణెవుణ్నీ నువ్వు జచ్చి గీపెట్టినా సెప్పం. కేసు నీ మీదికి తొయ్యాలనే మునుసోబు నిన్నియాల యిడిపిచ్చింది. ఇట్టొచ్చేవా, అట్టాబోతవు బొక్కలేకి పోరా నాకొడక!

'నేనూ మీతో వత్తానన్నా'

'శా! పో! శండాలపు నాకొడక. మాకూ తీకు సాపత్తేవా. పోరా పో! ఎగిరిచ్చి తంతే దొమ్మలు బగులుతాయి' మిడిగుడ్లోడు నెట్టేశాడు. ఎరగుడ్లోడు ఎదురొమ్ముల మీద తన్ని ఎగరి కూలబడ్డాడు.

'ఆణ్ణి ఈడు లేప, ఈణ్ని ఆడు లేప, లేవ లేక జాన' అనుకొన్నాడు సుబ్బడు. కింద పడ్డావాడు పడ్డట్లే కూర్చున్నడు. ఎర్ర దుమ్ములో నుంచి లేవాలనిపించలేదు. ఎండలో ఎర్ర దుమ్ములో మిట్ట మధ్యాహ్నం, దుమ్ము కాలటంలేదు.

మధ్యాహ్నం కూల బడ్డ వాడు చీకటి పడిందాకా లేవకుండా అక్కడే కూర్చున్నాడు. కళ్లు తిరుగుతూన్నయి. ఊరు తిరుగుతూ ఉంది. భూగోళం తిరుగుతూ ఉంది.

ఎప్పటికో పాకలోకి వచ్చాడు. రాత్రంతా నిద్ర పట్టలేదు. వొళ్లంతా నొప్పులు. నిద్ర లేదు. శరీరం అంతా నొప్పి. నల్లులు నెత్తురు తాగుతున్నాయి. తలకాయలో సీకులా హత్య! పోలీసులు, కోర్టు, ఉరి, ఆజన్మ ఖైదు. గుండెలు కూడా నొప్పి పెడుతున్నాయి.

సుబ్బడు మంచాన్ని వదల్లేదు, మళ్లీ ఉడుకునీళ్లు తెచ్చాడు. మంచం కూసాల్లో, కోళ్లసందుల్లో పట్టెల బొక్కల్లో, నులక కింద, సుబ్బడు వెతికి వెతికి ఉడుకుడుకు నీళ్లు పోశాడు.

ఈర్లు, ఈర్ల కుదుళ్లు, నుసి నల్లులు వేడి నీళ్లకు మాడి మసైపోయాయి. మంచం విదిలించి కొడితే ఈర్ల కుదుళ్లు తుట్టెలు తెట్టెలుగా రాలి పడ్డాయి. ఇక మంచంలో నల్లులు లేవు. ఈ రాత్రి హాయిగా నిద్రపోవచ్చు.

హాయి మాట అనుకొంటే నొప్పులు గుర్తుకు వచ్చాయి. పోలీసుల దెబ్బలకంటే మునసబు దొంగ అనటం నొప్పిగా ఉంది. దొంగ హంతకుడు కాబోతున్న కల్లు సందడి కలుక్కుమంది.

బలి చేయటానికి తీసుకుపోతున్న మేకపిల్ల మెళ్లో కట్టిన పోతురాజు వేప ఆకు నమిలి ఆకలి తీసుకో బోతోంది. ఉరిశిక్ష పడ్డ వాడు ఒక కోర్కె కోరి, అది తీర్చుకొని చని పోతాడు. చావ బోయే ముందు ఒక్క రోజయినా సుఖంగా నిద్రపోదా మనుకొన్న నుబ్బడి స్వార్థం సుబ్బడిది.

పొద్దు కుంకింది. చీకటి పడింది. సుబ్బడు మంచం పాకలో వేనుకొని, కాళ్లు నిగడదోలి, కళ్లు పత్తి కాయల్లా విప్పి, తల కింద రెండు చేతులూ పెట్టుకొని పైకి చూస్తూ పడుకున్నాడు. బుడ్డి దీవం వెలుగుతూ ఉంది.

తెల్లవారింది. ఊరంతా గుప్పుమంది. పల్లెంతా భగ్గుమంది. సుబ్బడు గురకపెట్టి నిద్రపోతున్నాడు.

రాత్రి మునసబు ఇల్లు కాలిపోయింది. బయట్లాగొళ్లెం పెట్టి, తాళం వేసి ఇంటికి నిప్పుపెట్టారు. ఇట్టు కాలేటప్పుడు మునసబుతోపాటు అతడి నమ్మిన బంట్లు ఎర్రగుడ్లోడు, మిడిగుడ్లోడు తోడుగా ఉన్నారు. ఇల్లు కాలుతున్నప్పుడు వాళ్లు బొగ్గు లయ్యారు. మసిబొగ్గులు, కారు నలుపు, తుమ్మ మొద్దులు.

పొద్దు నడి నెత్తి మీదికి వచ్చినా సుబ్బడు నిద్ర పోతున్నాడు. గురకలు పెట్టి నిద్ర పోతున్నాడు.

తాత వచ్చాడు. పాక లోకి పోయాడు. నిద్ర పోయే వాడి తల నిమిరాడు. వీపు నిమిరాడు. గుండె నిమిరాడు.

రేత్రి అంతా ఆయిగా నిద్దర బోతివి కదరా. నల్లులన్నీ సచ్చినై. ఇంక ఆయిగా పడుకోవచ్చు. ఇప్పటికిక జాల్లే. నిద్దర్లేయ్'

●